రేషన్ బండి.. ఆపొద్దండి



ఇంటి వద్ద రేషన్ పంపిణీ చేస్తున్న ఎండీయూ వాహనం (ఫైల్)

- పాత పద్ధతిలో ఇంటి వద్దే సరుకులు ఇవ్వాలని ముక్తకంఠంతో కోరుతున్న మహిళలు
- కూలినాలీ చేసుకునే తాము రేషన్ షాపుల వద్ద క్యూలు కట్టలేమని ఆవేదన వ్యక్తీకరణ
- కూటమి ప్రభుత్వ నిర్ణయంతో రోడ్డున పడ్డామంటున్న ఎండీయూ వెహికల్ ఆపరేటర్లు
- సర్కిల్–2 పరిధిలో 41 ఎండీయూ వాహనాలు



భగత్‌సింగ్ కాలనీలో ఇంటి వద్దే రేషన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్న మహిళలు

సీతంపేట: ఐదేళ్లుగా ఇంటి గుమ్మం వద్ద ఇస్తున్న రేషన్ అకస్మాత్తుగా కూటమి ప్రభుత్వం నిలిపేయడం పట్ల మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం ఇంటి వద్దే రేషన్, పింఛన్లు, అవసరమైన సర్టిఫికెట్లు వలంటీర్ల ద్వారా అందించేది. కూటమి ప్రభుత్వం వచ్చాక వలంటీర్లు తొలగించారని, ఇప్పుడు ఏం కావాలన్నా సచివాలయాలకు, ఎమ్మార్వో కార్యాలయానికి తిరగాల్సి వస్తోందని మహిళలు మండిపడుతున్నారు. ఇన్నాళ్లు ఇంటి ముందుకు వచ్చి రేషన్ ఇచ్చే ఎండీయూ వాహనాలను రద్దు చేయడంతో మళ్లీ పాత కాలం నాటి కష్టాలు మొదలయ్యాయని మహిళలు ఆందోళన చెందుతున్నారు. ఇంటికి దూరంగా ఉన్న రేషన్ షాపు వద్దకు నడిచి గాని ఆటోలో గాని వెళ్లాలి.. తీరా వెళ్లాక షాపు తీసి ఉంటుందో లేదో తెలియని పరిస్థితి. లేదంటే మరొక రోజు వెళ్లాల్సి వచ్చేదని వెనుకటి రోజులు గుర్తుకు తెచ్చుకుంటున్నారు. నాలుగు రోజులు ఆలస్యంగా వెళ్తే సరుకులు అయిపోయాయని చెప్పేవారని, దూరాభారంగా ఉండే రేషన్ షాపుకు ఆటోలో వెళ్తే బియ్యం ధర కంటే ఆటో ఖర్చే అధికమవుతుందని ఆవేదన వెలిబుచ్చుతున్నారు. ప్రజల అభిప్రాయం తెలుసుకోకుండా ఉన్న పళంగా ఇంటి వద్దకు రేషన్ పంపిణీ విధానాన్ని తొలగిస్తే మరల రేషన్ కోసం షాపుల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తుందని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆడవాళ్లు ఇళ్లల్లో పనులకు, మగాళ్లు కూలి పనులకు పోయేటోళ్లం.. మేమున్న సమయంలో ఇంటికి బండి వచ్చేది.. చక్కగా రేషన్ ఇచ్చేవారు. ఇప్పుడు మరల రేషన్ కోసం పనులు మాని క్యూలు కట్టలేమని, ఎప్పట్లా ఇంటి వద్దే రేషన్, పింఛను ఇవ్వాల్సిందేనని మహిళలు డిమాండ్ చేస్తున్నారు.

సర్కిల్–2 పరిధిలో..

రెండు డిపోలకు ఒక రేషన్ బండి చొప్పున సర్కిల్–2 పరిధిలో 41 ఎండీయూ వాహనాల (రేషన్ బళ్లు) ద్వారా ప్రతి నెలా రేషన్ సరుకుల పంపిణీ జరుగుతోంది. ప్రతి వార్డులో మురికివాడలు, కాలనీలు, స్కీం ఇళ్ల వద్దకు రేషన్ బండి వచ్చి సరుకులు అందజేసేది. నాలుగేళ్లుగా అలవాటైన పద్ధతిని రద్దు చేసి మరలా పడిగాపులు కాయమనడం సబబేనా అని మహిళలు ప్రశ్నిస్తున్నారు.

ఉపాధి చూపించండి...



గత ఐదేళ్లుగా 43, 44 వార్డుల్లో రేషన్ బండి డ్రైవర్‌గా సేవలందిస్తున్నాను. వెహికిల్ కోసం రూ. 70 వేలు కట్టాను. నెలకి రూ.23 వేలు ఇస్తున్నారు. అందులో మూడు వేలు వెహికిల్ ఈఎంఐకి, 5 వేలు తూకం వేసే హమాలీకి, మరో మూడు వేలు పెట్రోల్‌కి వెచ్చిస్తున్నాం. ఇక డ్రైవర్‌కి మిగిలేది కేవలం రూ. 10 వేలు. నెలలో 15 రోజులు పని ఉండేది. మిగతా రోజులు ఆటో వేసి కుటుంబాన్ని పోషిస్తున్నాను. అకస్మాత్తుగా తొలగిస్తే మా కుటుంబం రోడ్డున పడ్డట్టే.

– కె.వెంకటరమణ, ఎండీయూ వెహికల్ ఆపరేటర్

ఎండీయూ ఆపరేటర్ల పొట్ట కొట్టారు..



72 నెలల ఎండీయూ వెహికల్ ఒప్పందంలో ఇంకా 20 నెలలు మిగిలి ఉండగానే తొలగించారు. మిగిలిన 20 నెలలు ఈఎంఐల సంగతి ఏమిటి. ఉన్నపళంగా తొలగిస్తే కుటుంబం గడిచేదెలా. గతంలో డీలర్లు రేషన్ ఇచ్చేటప్పుడు 60 శాతం పంపిణీ జరిగేది. ఎండీయూ వాహనాలు వచ్చాక 90 నుంచి 95 శాతం వరకు రేషన్ పంపిణీ జరుగుతోంది. గంటల తరబడి నిరీక్షించకుండా కాలనీలు, మురికివాడలకు వెళ్లి రేషన్ ఇస్తున్నాం. నెలకి రూ.10 వేలు ఇచ్చే ఎండీయూ ఆపరేటర్ల పొట్ట కొట్టడం అన్యాయం.

– ఎం.సాంబమూర్తి, ఎండీయూ వెహికల్ ఆపరేటర్

ఇంటి వద్దే రేషన్ ఇవ్వాలి..



ద్వారకానగర్ కళా ఆస్పత్రి రోడ్డులో నివసిస్తున్నాం. భగత్‌సింగ్ కాలనీ, జేఎస్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీ, ఇందిర సంజీవ్ భీమ్‌నగర్ కాలనీలో సుమారు 400 కుటుంబాలు ఉంటున్నాయి. మహిళలు ఇళ్లల్లో, మగవాళ్లు కూలి పనికి పోతాం. గత ఐదేళ్లుగా ఇంటి గుమ్మం వద్ద రేషన్ ఇస్తున్నారు. పనులకు వెళ్లి వచ్చి మరల రేషన్ షాపుల వద్ద లైన్ కట్టి గంటల తరబడి ఉండలేం. తీరా వెళ్లాక షాపు తీస్తారో తియ్యరో తెలియని పరిస్థితి. అందుకే ప్రస్తుతం ఇస్తున్న విధానంలోనే ఇంటి వద్దే రేషన్ ఇవ్వాలి.

– బంటు సూరమ్మ, ద్వారకానగర్

మా డిపో తరలించారు..



భగత్‌సింగ్‌కాలనీ, జేఎస్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీ, ఇందిర సంజీవ్ భీమ్‌నగర్ కాలనీలకు శంకరమఠం వద్ద ఉన్న 30, 31 డిపోలకు మ్యాపింగ్ చేశారు. ప్రస్తుతం ఆ రెండు డిపోలు మధురవాడకు తరలించారు. రేషన్ బండి ఆపేస్తే ఇటు దొండపర్తి గాని అటు రామా టాకీస్ వద్ద ఉన్న డిపోలకు వెళ్లాలి. రెండు కిలో మీటర్ల నడక, బరువుమోత, గంటల తరబడి నిరీక్షణ తప్పదు. ఆటోలో వెళ్తే బియ్యం ఖర్చు కంటే ఆటో ఖర్చే అధికమవుతుంది. ప్రభుత్వం పునరాలోచన చేసి ఇంటి వద్దే రేషన్ పంపిణీ చేయాలి.

– గార ఈశ్వరమ్మ, భగత్‌సింగ్ కాలనీ.

వీధి దీపాల నిర్వహణకు ప్రత్యేక చర్యలు



స్థానికులతో మాట్లాడుతున్న ఏఈ అర్చన

మురళీనగర్: మురళీనగర్ పరిసరాల్లోని వీధి దీపాల నిర్వహణకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామని జీవీఎంసీ విద్యుత్ శాఖ ఏఈ అర్చన తెలిపారు. వార్డులోని తెన్నేటినగర్ పరిసర ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని వార్డు టీడీపీ అధ్యక్షుడు వరప్రసాద్, పార్కు అధ్యక్షుడు ఎన్.ఈశ్వరరావు జెడ్పీ బి.రాము దృష్టికి తీసుకువచ్చారు. జెడ్పీ ఆదేశాల మేరకు ఏఈ తెన్నేటినగర్ పరిసర ప్రాంతాలతో పాటు, మురళీనగర్‌లో వీధి దీపాల పరిస్థితిని శుక్రవారం పరిశీలించారు. చైన్ స్నాచింగ్స్, కుక్కల బెడద తగ్గించడానికి రాత్రి పూట వీధి లైట్లు వెలిగే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు ఆమెను కోరారు. దీనిపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి విద్యుత్ లైట్లు నిరంతరం వెలిగే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో వరప్రసాద్, ఎన్.నాగరాజు, కె.మోహన్, రామరాజ్యం పాల్గొన్నారు.

అలరించిన కర్ణాటక గాత్ర కచేరీ



కీర్తనలు ఆలపిస్తున్న గాయకుడు శివశంకర్

సీతంపేట: అక్కయ్యపాలెంలోని శ్రీ లలితాపీఠంలో శుక్రవారం సాయంత్రం జరిగిన కర్ణాటక గాత్ర కచేరి భక్తులను అలరించింది. గాయకుడు డాక్టర్ గుమ్మలూరి శివశంకర్ తన మధుర స్వరంతో త్యాగరాజ, శ్యామశాస్త్రి, అన్నమయ్య, పురంధర దాసు, మంగళంపల్లి బాలమురళీకృష్ణ కృతులను ఆలపించి అలరించారు. టి.ఎస్.చైతన్య మృదంగంపై, ఎస్.వి.ఎస్.కృష్ణప్రియ వయోలిన్‌పై వాద్య సహకారం అందించారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ గాయకుడు శివశంకర్‌ను సత్కరించారు.

క్లుప్తంగా

26వ వార్డులో మెగా ఫాగింగ్



అక్కయ్యపాలెంలో ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది

సీతంపేట: దోమల నియంత్రణకు జీవీఎంసీ మలేరియా విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం 26వ వార్డులోని పలు ప్రాంతాలలో మెగా ఫాగింగ్ నిర్వహించారు. వార్డు పరిధిలో లలితానగర్, బోరావారివీధి, చాకలిపేట, రామకృష్ణానగర్, సాక్షి ఆఫీస్ లైన్, శంకువానిపాలెం, శంకరమఠం రోడ్, అక్కయ్యపాలెం మెయిన్‌రోడ్, 80 అడుగుల రోడ్, శివాలయం లైన్, చిన్నూరు మసీదు, జగ్గారావు బ్రిడ్జి ప్రాంతాలలో ఫాగింగ్ చేపట్టారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు కె.ఎస్.ఎస్.నారాయణ, రాంబాబు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ఇంటి పరిసరాలలో నీరు నిల్వ లేకుండా చూడాలని, వారానికి ఒక రోజు డ్రైడే పాటిస్తే దోమలు పెరగకుండా చూడవచ్చని తెలిపారు.

రైల్వేస్టేషన్‌లో ఏడు కిలోల గంజాయి సీజ్

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో గంజాయి అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తిని రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకుని, గంజాయి స్వాధీనం చేసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలివి.. ఉన్నతాధికారులు ఆదేశాలతో జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది రైల్వే స్టేషన్లో ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో కర్ణాటక రాష్ట్రం, ఉడుపి జిల్లాకు చెందిన సాగర్ డి అల్మేడ విశాఖపట్నం రైల్వేస్టేషన్ మీదుగా గంజాయిని అక్రమంగా రవాణా చేయడం గుర్తించారు. అతడిని అదుపులోకి తీసుకుని 35వేల రూపాయల విలువైన 7కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. జీఆర్పీ సిబ్బంది కేసు నమోదు చేసి, నిందితుడిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరిచారు. ఈ తనిఖీలలో జీఆర్పీ ఎస్ఐ కె.శాంతారం, ఆర్పీఎఫ్ మహిళా ఎస్ఐ జూలీ కర్మాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వైభవుడికి సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీఓస్ కాలనీలో కొలువుదీరిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి బి.ప్రసాద్ తెలిపారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల నిర్వహించి, సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. 7.30గంటలకు బాలభోగం, 9.30గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థ ప్రసాద గోష్ఠి, 10గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30గంటలకు రాజభోగ నివేదన ఉంటుంది. మధ్యాహ్నం నారాయణ సేవలో భాగంగా భక్తులకు అన్నసమారాధన చేస్తారు. సాయంత్రం 6.30గంటలకు విశేష హారతి సమర్పణలో భాగంగా నక్షత్ర హారతి, కర్పూర హారతి, కూష్మాండ హారతి, కుంభ హారతి ఇస్తారు.

ఆకట్టుకున్న సంగీత విభావరి



పాటలు పాడుతున్న గాయనీమణులు

సీతంపేట: ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ వేడుకల్లో భాగంగా నారీ భేరి ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన సంగీత విభావరి అలరించింది. నవరస పాటలు, నవరాగ రాత్రులు పేరిట తొమ్మిది రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ వేడుకల్లో ఎన్టీఆర్ నవరస పాత్రల్లో మెప్పించిన సినిమాల్లోని పాటలు ఆలపించి ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. 1950 నుంచి ఎన్టీఆర్ నటించిన హిట్ చిత్రాల్లోని మెలోడీ సాంగ్స్ పాడి సభికులను ఆకట్టుకున్నారు. గాయనీ గాయకులు కె.భాగ్యలక్ష్మి, సి.వి.రాజేశ్వరి, శైలజా మెరాజ్, ఎం.రూపవాణి, పుండరి కుమార్, కె.సూర్యప్రకాష్, బంగారయ్య, మనోహర్ పాటలు పాడి ప్రేక్షకులను రంజింపజేశారు.

నేడు ఆర్కేబీచ్ వేదికగా యోగా ఈవెంట్

మహారాణిపేట: యోగాంధ్ర వేడుకల్లో భాగంగా శనివారం ఉదయం ఆర్కే బీచ్ రోడ్డులోని శాశ్వత వేదిక వద్ద జిల్లా స్థాయి యోగా ఈవెంట్ జరగనుంది. ఈ కార్యక్రమానికి జిల్లా యంత్రాంగం పటిష్ట ఏర్పాట్లు చేస్తోంది. ఈవెంట్‌లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి, జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొననున్నారు. ప్రజలు కూడా స్వచ్ఛందంగా పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ హరేందిర ప్రసాద్ పిలుపునిచ్చారు.

మహిళల సేవలు ఆదర్శనీయం



ప్రతిభావంతులకు నగదు బహుమతులు అందిస్తున్న 101 గవర్నర్ ద్వారకానాథ్



పాల్గొన్న మహిళా వాకర్లు



అలరించిన అన్విత భరతనాట్యం

మురళీనగర్: మహిళా వాకర్స్ క్లబ్ నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాయని జిల్లా 101 గవర్నర్ కె. ద్వారకానాథ్ అన్నారు. మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ 19వ వార్షికోత్సవం అధ్యక్షురాలు కె.మాధవి అధ్యక్షతన వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు రెండు దశాబ్దాలుగా క్లబ్ మహిళలు నిరంతరం ప్రజా సంక్షేమ కార్యక్రమలతో పాటు నడక, ఆరోగ్యం పట్ల మహిళలకు సంపూర్ణ అవగాహన కల్పించడంలో విశేషంగా కృషి చేయడం అభినందనీయమన్నారు. పేద విద్యార్థుల చదువుకు చేయూతనిస్తూ వారి ఉన్నతికి కృషి చేస్తున్నారని కొనియాడారు. ముందుగా వాకర్స్ ఉద్యమ వ్యవస్థాపకుడు సుంకరి ఆళ్వార్ దాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. వాకర్స్ ఇంటర్నేషనల్ అడిషనల్ సెక్రటరీ జనరల్ రాళ్లపల్లి సత్యనాథం, జిల్లా 101 కాన్ఫరెన్స్ చైర్మన్ కమల్ బైద్ మాట్లాడుతూ మహిళలు నిర్వహించే సేవా కార్యక్రమాలకు తమ వంతు సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. రిషిశ్లోక (కర్ణాటక) పాశ్చాత్య నృత్య ప్రదర్శన, అన్విత (బెంగళూరు) భరత నాట్యం ఆహూతులను అలరించాయి. పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ఆరుగురు విద్యార్థులకు క్లబ్ సభ్యురాలు ఆంధ్రా లక్ష్మి సమకూర్చిన నగదు పారితోషికాలు, ప్రశంసా పత్రాలు, నోట్ పుస్తకాలను ముఖ్య అతిథుల చేతుల మీదుగా అందజేశారు. కుప్పిలి శకుంతల, ఆంధ్రా లక్ష్మి మహాత్మా గాంధీ ఫెలోషిప్ తీసుకున్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంలో మహాత్మా గాంధీ ఫెలోషిప్‌కు ఎంపికైన జి.మహాలక్ష్మిని జిల్లా 101 గవర్నర్ ఫ్లెక్, శాలువాతో సత్కరించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా సత్తి వీర రాఘవరెడ్డి 200 మందికి గుడ్డ సంచులు పంపిణీ చేశారు. అనంతరం వైభవ్ జ్యూయలరీ సంస్థ నిర్వహించిన లక్కీడిప్‌లో 10 మంది విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో 101 ఎలక్ట్ గవర్నర్ ఆర్‌ఆర్‌ఆర్ మహేష్, ఈస్ట్ పార్క్ అధ్యక్షుడు బి.మురళీ కృష్ణ, క్లబ్ కార్యదర్శి పి.కమల, పూర్వ అధ్యక్షులు సత్తి లలితారెడ్డి, ఎం.శేషామణి తదితరులు పాల్గొన్నారు.

వారానికి ఒక రోజు డ్రై డే పాటించండి



డ్రమ్ములో పెరుగుతున్న దోమ లార్వాలను పరిశీలిస్తున్న హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్

సీతంపేట: వారం రోజులు పైబడి మంచినీరు, వర్షపు నీరు నిల్వ ఉంటే మలేరియా, డెంగ్యూ జ్వరాలను కలగజేసే దోమలు వృద్ధి చెందే అవకాశం ఉందని మలేరియా హెల్త్ అసిస్టెంట్ కె.శ్రీనివాసరావు తెలిపారు. జీవీఎంసీ 25వ వార్డు సీతంపేటలో శుక్రవారం ఫ్రైడే డ్రైడే అమలు తీరును పరిశీలించారు. ఏఎన్‌ఎం అప్పలనరసతో ఇంటింటికి వెళ్లి నీటి నిల్వలను పరిశీలించారు. కుండీలు, డ్రమ్ముల్లో లార్వాలు పెరుగుతున్నట్టు గుర్తించి, ఆ నీటిని పారబోయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాలలో నీరు నిల్వ లేకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. వారానికి ఒక రోజు ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి, గోళాలు, కుండీలు, సంపులు, ట్యాంకులలో నీటిని తొలగించి ఆరబెట్టి మరలా నీటిని పట్టుకోవాలని సూచించారు. జీవీఎంసీ యాంటీ లార్వా సిబ్బంది పాల్గొన్నారు.

నలుగురిని కాపాడిన లైఫ్‌గార్డ్స్



పర్యాటకులను రక్షించిన లైఫ్‌గార్డ్స్

డాబాగార్డెన్స్: ఆర్కే బీచ్‌లో పెను ప్రమాదం తప్పింది. హైదరాబాద్‌కు చెందిన ఎనిమిది మంది యువకులు సరదాగా గడిపేందుకు బీచ్‌కు వచ్చారు. వారిలో నలుగురు సముద్రంలో మునిగిపోతూ ఉండగా జీవీఎంసీ లైఫ్‌గార్డ్స్ వెంటనే స్పందించి కాపాడారు. జీవీఎంసీ ఇన్‌చార్జి స్పోర్ట్స్ డైరెక్టర్ రాజు తెలిపిన వివరాలివి. హైదరాబాద్ నుంచి వచ్చిన షబ్బీర్, అబ్బాస్, ఇద్రిస్, హుస్సేన్ అనే యువకులు శుక్రవారం ఉదయం ఆర్కే బీచ్‌లో స్నానానికి దిగారు. అయితే సముద్ర అలల ఉధృతికి వారు నీటిలో మునిగిపోవడం గమనించిన బీచ్ లైఫ్‌గార్డ్స్ ధనరాజు, నవీన్, ఆనంద్, లక్ష్మణరావు, కేపీ వాసు వెంటనే రంగంలోకి దిగారు. నలుగురు యువకులను సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. అనంతరం వారికి ప్రథమ చికిత్స అందించారు. ఆ తర్వాత వారిని పోలీసులకు అప్పగించారు. పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించిన అనంతరం వారిని పంపించివేశారు.

వైభవంగా శ్యామలాంబ అనుపు ఉత్సవం



ఆకట్టుకున్న దుర్గల డ్యాన్సు



అలంకరణలో అమ్మవారు



ఘటాలు, కలశాలతో ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

సీతంపేట: అక్కయ్యపాలెం లలితానగర్‌లో కొలువైన శ్యామలాంబ పండగలో భాగంగా శుక్రవారం అనుపు ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. వేకువజామున 5 గంటల నుంచి అమ్మవారికి జలంతో పాటు పంచామృతాలు, పాలు, గంధం, పసుపు, కుంకుమలతో విశేష అభిషేకాలు చేశారు. సాయంత్రం లలితానగర్‌లోని సదరంపట్టు నుంచి అమ్మవారి తిరువీధి ఊరేగింపు మేళతాళాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో వైభవంగా జరిగింది. పెద్ద సంఖ్యలో మహిళలు అమ్మవారి ఘటాలు, కలశాలు తలపై పెట్టుకుని ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పులివేషాలు, దుర్గాదేవి డ్యాన్సులు, తప్పెటగుళ్లు, తీన్‌మార్ బ్యాండ్, విద్యుత్ లైటింగ్ ఆకట్టుకున్నాయి. పెద్ద సంఖ్యలో అమ్మవారి భక్తులు ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ నెల 30వ తేదీన అమ్మవారి మారువారం పండగ, జూన్ 2న మహా అన్నదానం జరుగుతుందని ఆలయ ప్రతినిధులు తెలిపారు.

ఆర్‌ఎంపీలు అల్ట్రాసౌండ్ స్కానింగ్ రిఫర్ చేయరాదు

మహారాణిపేట: జిల్లాలోని ఆర్‌ఎంపీలు గర్భిణులకు అల్ట్రాసౌండ్ స్కానింగ్ రిఫర్ చేయరాదని ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ పూర్ణేంద్రబాబు అన్నారు. గర్భిణులకు ఎవరైనా నాటు వైద్యం చేసినా, ఆర్‌ఎంపీలు వైద్యం చేసినా, అల్ట్రాసౌండ్ స్కానింగ్‌కు రిఫర్ చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా వైద్యుల సలహా మేరకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యం పొందడం వల్ల మాతా, శిశు మరణాలను నియంత్రించవచ్చని అన్నారు.

రిజిస్ట్రేషన్ తప్పనిసరి..

విశాఖ నగరం, గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఆస్పత్రులు, క్లినిక్‌లు, ల్యాబ్, స్కానింగ్ కేంద్రాలు, ఫెర్టిలిటీ కేంద్రాలు తప్పనిసరిగా క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్–2002 ప్రకారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయం (ఆన్‌లైన్)లో రిజిస్టర్ చేసుకోవాలని ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో తెలిపారు. రిజిస్ట్రేషన్ లేకపోతే అటువంటి కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆస్పత్రులు, క్లినిక్‌లు, ల్యాబ్ యాజమాన్యాలు http@// clicalesttact. ap. gov. in ద్వారా, స్కానింగ్ కేంద్రాల యాజమాన్యాలు https@// pcpndt. ap. gov. in ద్వారా రిజిస్టర్ చేసుకోవలసిందిగా తెలిపారు.

‘గెస్ట్ ఫ్యాకల్టీలు అవసరమా..?’

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీలో గెస్ట్ ఫ్యాకల్టీల అవసరం ఏ మేరకు ఉందనేది మరోమారు చర్చకు దారి తీసింది. ఏయూ క్యాంపస్ కాలేజీల ప్రిన్సిపాళ్లు, విభాగాధిపతులతో శుక్రవారం సమావేశమైన వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ వివిధ అంశాలపై సుదీర్ఘంగా సమీక్షించారు. అంతర్గతంగా జరిగిన సమావేశం కావడంతో వివరాలు గోప్యంగా ఉంచారు. ఈ నెల 28న రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల వైస్ చాన్సలర్లు, రిజిస్ట్రార్‌లతో నిర్వహించే సమావేశానికి సమగ్ర నివేదికలతో హాజరు కావాలని ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఇక్కడి అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఏయూలో జరిగిన సమావేశానికి ప్రాధాన్యం సంతరించికుంది. వర్సిటీలోని విభాగాల వారీగా పనిచేస్తున్న గెస్ట్ ఫ్యాకల్టీలు లెక్క తీసిన వీసీ రాజశేఖర్ ఒకింత విస్మయం వ్యక్తం చేసినట్లు తెలిసింది. విభాగాల్లో ఇంతమంది అవసరమా..? అని ప్రశ్నిస్తూనే.. వారిలో బోధనా నైపుణ్యత ఎంత ఉందనేది తెలుసుకునేందుకు మరోమారు ఇంటర్వ్యూలు నిర్వహించేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ప్రస్తుతం పని చేస్తున్న వారిలో అనుభవజ్ఞులను కొనసాగిస్తూనే.. కొత్తగా తీసుకునేందుకు ఎలా ముందుకెళ్లాలనే దానిపై అందరి అభిప్రాయాలను సేకరించినట్లు సమాచారం. ప్రస్తుతం వర్సిటీలోని అన్ని విభాగాల్లో కలిపి సుమారుగా 400 వరకు గెస్ట్ ఫ్యాకల్టీలు పనిచేస్తున్నారు. వీరిలో కొంతమందిని పద్ధతి ప్రకారం కాకుండా హెచ్‌వోడీలు తమకు నచ్చిన రీతిలో నియమించేశారనే ఫిర్యాదులు సైతం ఉన్నాయి. దీనిపై ఫోకస్ పెట్టిన ప్రస్తుత వైస్ చాన్సలర్.. విభాగాల్లో ఎంతమంది అవసరం..? ఎవరిని ఉంచాలి..? ఎవరిని తీసేయాలనే దానిపై కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది. ఈ విషయం బయటకు పొక్కడంతో కొంతమంది గెస్ట్ ఫ్యాకల్టీలు అప్పుడే లాబీయింగ్‌లను మొదలుపెట్టారు. వీసీపై ఒత్తిడి తీసుకొచ్చి.. తాము కొనసాగేలా పావులు కదుపుతున్నారు.

కొత్త రేషన్ కార్డుల దరఖాస్తుపై అవగాహన

మహారాణిపేట: డీఎస్‌వో భాస్కరరావు శుక్రవారం నగరంలోని పలు సచివాలయాలను సందర్శించారు. అక్కడ కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసిన వారితో మాట్లాడారు. వారికి సలహాలు, సూచనలు అందజేశారు. రేషన్ కార్డు మంజూరుకు ఏమేం కావాలో అవగాహన కల్పించారు. దండుబజార్ సచివాలయంలో కొత్త రేషన్ కార్డుకు దరఖాస్తు చేసిన వారితో మాట్లాడి పలు సూచనలిచ్చారు.

హరితహారం దీని కోసమేనా?



అక్కయ్యపాలెం హరితహారంలో పార్క్ చేసిన ద్విచక్ర వాహనాలు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ పరిధిలో ఆయా ప్రాంతాల్లో ఎండ వేళల్లో సేదదీరేందుకు హరిత హారాలు నిర్మించారు. కానీ ఇవి ఏర్పాటు చేసిన ఉద్దేశం చాలా చోట్ల నిర్వీర్యమైపోతోంది. మనుషులకు ఆశ్రయం ఇవ్వాల్సిన ఈ హరిత హారాల్లో వాహనాల పార్కింగ్, ఇతరత్రా అవసరాల కోసం వినియోగిస్తున్నారు. అక్కయ్యపాలెంలో గల జియో షోరూం ఎదురుగా నిర్మించిన ఈ హరిత హారంలో చాలాసార్లు ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేసుకుంటున్నారు. ఈ దారిన పోయేవారు వాహనాల కోసమా ఈ హరితహారాలు అని ముక్కున వేలేసుకుంటున్నారు.